

# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



**చిన్నప్పుడు మా ఇంటికి** బోలెడు మంది చుట్టాలొచ్చేవారు. నేను కళ్ళు తెరిచేటప్పటికే కలగాపులగంగా మగగొంతులూ, ఆడగొంతులూ పెద్ద పెద్దగా మాట్లాడ్తూ, గలగలా నవ్వుతూ వినిపించేవి. అమ్మమ్మ కుంపటి విసుర్తూ, కళపెళ మరుగుతున్న నీళ్ళల్లో కాఫీ బిళ్ళ (కాఫీ బిళ్ళలు అమ్మేవారు) వేసి, బట్టతో వడపోసి, చిక్కని పాలు పోసి, పంచదార వేసి కాఫీ చేస్తుంటే, 'ఘుమ్మని' ముక్కుపుటాలకి ఆ వాసన తాకి ఠకీమని లేచికూర్చునేదాన్ని. ఎక్కువగా నాగ్‌పూర్ పెద్దమ్మా, పెద్దనాన్నా వచ్చేవారు. వాళ్ళొస్తే నేనిక ఆ పూట స్కూల్‌కి వెళ్ళేదాన్ని కాదు. ఎందుకంటే పెద్దమ్మకి హైదరాబాద్ రాగానే తెలుగు పుస్తకాలు కావాలి, ఆ తరువాత చిక్కడపల్లి సుధా హోటల్‌లో ఇడ్లీలు తినాలి. ఆ తరువాత ఏదో ఒక తెలుగు సినిమా చూడాలి. అలా తెలుగుకి మొహం వాచిపోయి వచ్చేవాళ్ళు. అంతేకాదు నాకోసం బొమ్మలూ, గౌనులు కూడా కొనుక్కొచ్చేవాళ్ళు.

ఎవరొచ్చినా ఎన్నాళ్ళుంటారో మాకు తెలీదు. ఎప్పుడు వెళతారో అస్సలు తెలీదు. ఎక్కువ మంది వస్తే అమ్మమ్మ పెరట్లో మామిడి చెట్టుకింద పొయ్యి పెట్టి అన్నం వార్చేది. పులుసులు సలసలా పొంగేవి. రుబ్బురోలు గిరగిరా తిరిగి కందిపచ్చడో, చింతకాయ పచ్చడో రుబ్బేది. మధ్యాహ్నాలు చేసే కొయ్యరొట్టె, చేగోడీల రుచి అసలు చెప్పనక్కర్లేదు.

కొంతమంది మంచి చుట్టాలుండేవారు. వాళ్ళు వచ్చేటప్పుడు కొబ్బరి బూరెలో, అరిశలో, జంతికలో చేసుకొచ్చేవారు. లేదా ఇక్కడ దిగాక మిఠాయి షాపులో ఏదైనా కొనుక్కొచ్చేవారు. అధమం బిస్కెట్ పాకెట్ అయినా తెచ్చేవారు. అమృతపాణీ లేదా చక్కెర కేళీ అరటి పండ్లు అయితే కామన్. అందుకే ఇంటికి చుట్టాలొస్తున్నారంటే మాకు సరదాగా ఉండేది.

కానీ రాత్రి కాగానే నేను పడుకునే మంచం మాయం అయ్యేది. హాల్లో వరసగా పక్కలు వేసి మమ్మల్ని వరసగా పడుకోమనేది అమ్మమ్మ. మంచం వచ్చిన చుట్టాల్లో మగాళ్ళ కిచ్చేది. ఇంకో మడత మంచం ఆడవాళ్ళకిచ్చేది. వాళ్ళకి పిల్లలుంటే మా పక్కన వరసలో పడుకునేవారు. వచ్చిన పూట ఆ పిల్లల్ని చూస్తే చిరాకేసేది. వాళ్ళకి అపురూపాలు చేసి హార్లిక్సులూ, బోర్నవిటాలూ కలిపి ఇచ్చేవారు వాళ్ళ అమ్మలు.

కాసేపయ్యాక ఆటల్లో పడ్డాక సరదాగా ఉండి, రాత్రికల్లా దుప్పట్లో దూరి కొత్తగా చూసిన ఏ 'హంతకుడూ దేవాంతకుడూ' సినిమా కథలో చెప్పుకుంటూ కలిసిపోయేవాళ్ళం. కానీ నిద్రలో అడ్డంగా తిరిగిపోయే వెధవలూ, వాళ్ళ కాళ్ళు మా మెడలకి పొట్లకాయల దండల్లా వేసేవాళ్ళు కూడా ఉండేవారు. డొక్కల్లో తన్నడం, విన్న సినిమా కథల వల్ల 'డిష్షూం డిష్షూం' అని ఎగరడం కూడా ఉండేది.

ఇది పిల్లగోల అయితే ఇక పెద్దవాళ్ళు కొందరు ఇల్లెగిరిపోయేటట్లు గురకలు పెట్టేవాళ్ళూ, ప్రొద్దుటే లేచి మూడు ఇళ్ళవాళ్ళు ఉలిక్కిపడేట్లు నాలిక గీస్తూ గాండ్రించేవాళ్ళూ, ఉండేవారు.

ఓసారి 'అమ్మా..' అన్న అరుపు విని మా అమ్మ ఏడుగంటల బిచ్చగాడొచ్చాడనుకుని అన్నం కెరడు ప్లేట్లో పెట్టుకుని 'వస్తున్నా నాయనా ఆగు' అని వీధిలో కెళితే, ఇంటికొచ్చిన చుట్టం పిల్లాడ్ని ఎత్తుకుని జోలపాడుా 'అమ్మా.. బజ్జో' అని కనిపించాడు. అమ్మ సిగ్గుపడిపోయింది.

మా పిల్లలందరికీ అమ్మమ్మ పక్కలు వెయ్యడం, కంచాలూ, మంచినీళ్ళూ పెట్టడం, తరువాత కంచాలు తియ్యడం, బియ్యం ఏరడం, ఇల్లు ఊడవడం, బట్టలు మడత పెట్టడంలాంటి పనులు పురమాయించేది. చుట్టాలొస్తే అస్తమానం గడ్డమీదున్న కిరాణాకొట్టుకెళ్ళి బెల్లమో, జీడిపప్పో, సెనగపిండో ఏదో ఒకటి తెమ్మనేది. చక్కగా పరమాన్నం, పులిహోరా, గారెలూ లాంటి పిండివంటలు తినడం బాగున్నా, చాకిరీ పెరిగిపోయేది. కొంతమంది మంచి చుట్టాలు పెట్టింది తినేవాళ్ళు. కొంతమందికి కోర్కెలు పిలకలేసేవి.

"రవణక్కయ్యా కాకరకాయలు పులుసు బెల్లం పెట్టి చేస్తావా? గుత్తివంకాయ కారం పెట్టి వండుతావా? నీలా దారం కట్టి గుత్తులు ఎవరూ వేయించలేరు. మజ్జిగ పులుసులో బూడిద గుమ్మడికాయ వేస్తావా? ఈసారి పిండివడియాలు పెట్టలేదు మీ మరదలు. ఇంట్లో ఉంటే వేయించూ! నీ చేతి కొబ్బరి లౌజు తిని ఎన్నాళ్ళయిందో." అంటూ ఆప్యాయంగా అమ్మమ్మ దగ్గర కూర్చుని అడిగి చేయించుకునేవారు. ఇంకా కొందరైతే "చూడు పిన్నీ.. మా వారికి గంటకోసారి కాఫీ తాగడం అలవాటు. ఏడున్నర అయ్యేసరికి టిఫిన్ కావాలి. ఇడ్లెన్నూ, ఉప్మా ఆయనకి నచ్చవు. పూరీ బంగాళదుంపల కూర అయితే ఇష్టంగా తింటారు." అని చెప్పే భార్యలూ వచ్చేవారు.

ఇంకా కొందరు "మిరియాల చారు పెడ్తావా పిన్నీ? కరివేపాకు కారం కొట్టు. కాస్త మందంగా ఉంది. నాకు పత్యం వంట కావాలి ఉప్పులేకుండా నీకు తెలుసుగా ఎందులోనూ ఉల్లీ, వెల్లుల్లీ వెయ్యబోకమ్మా" అనే శషభిషల రావూ ఉండేవారు.

ఇంకొందరికి విచిత్రమైన అలవాట్లు ఉంటాయి. ఒకబ్బాయి మా ఇంటికొచ్చి ఎడమ చేత్తో అన్నం తింటున్నాడు. "అయ్యో అదేవిటయ్యా? ఎడమ చేత్తో" అవగానే, టక్కున విస్తరి ముందు నుండి లేచి వెళ్ళిపోయాడు. తర్వాత తెలిసింది వెంకటేశ్వరస్వామికి మొక్కట. అదేవిటో మరి ఆయన ఈవిధంగా ఎందుకు చెయ్యమంటాడో?

మరొకాయన విస్తరిలో కూరలూ, పప్పూ, పచ్చళ్ళూ అడిగి మరీ వేయించుకుని, సగం తిని, సగం వదిలేసేవాడు. అమ్మమ్మకి భోజనం ఇలా వ్యర్థం చేస్తే మా చెడ్డ చిరాకు. ఇలాంటి వాళ్ళకి మాత్రం ప్రైవేటు చెప్పేది.

మా అత్తెసరు గిన్నెకీ, పులుసు రాచ్చిప్పకీ చిన్నతనంలో రెస్ట్ ఉండేదే కాదంటే అతిశయోక్తికాదు. హైదరాబాదులో ఉండడం మూలాన ఆస్పత్రి పనులకొచ్చేవాళ్ళూ, కోర్టుపనుల కొచ్చేవాళ్ళూ, గవర్నమెంటు ఆఫీసుల్లో పనులంటూ వచ్చేవాళ్ళూ, పెళ్ళిసంబంధాలంటూ వచ్చేవాళ్ళూ అంతా మా ఇంటికే వచ్చేవారు.

ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏవిటంటే, మా పెద్దమ్మ ఆఫీసు వాళ్ళవరైనా హైదరాబాదు చూడాలంటే - "మా చెల్లెలింట్లో ఉండండి" అని నాగ్‌పూర్ నుండి ఎడ్రెస్ ఇచ్చి పంపించేది. అలాగే ఓసారి జ్యోతీ, అర్చన బారువా అనే ఇద్దరు అమ్మాయిల్ని పంపించింది. ఒక అమ్మాయి మహరాష్ట్రియన్, రెండో అమ్మాయి నేపాలీ.

అమ్మ ఇద్దర్నీ రిసీవ్ చేసుకుని ఊరంతా తిప్పి చూపించేది. వాళ్ళకి మన సాంబారూ, కూరలూ కారం అనిపించినా, ఇష్టంగా గిన్నెలు కూడా ఊడ్చుకుని తినేసేవారు. వాళ్ళు మాత్రం అర్ధరాత్రి అపరాత్రీ కటకటలాడుా ఏవో సంచుల్లోంచి తీసుకుని తినేవారు. ఇంకోసారి ఒక అమ్మాయిని చూపించి "ఈ అమ్మాయి పేరు ప్రభ. ఆర్.టీ.సీలో ఏదైనా ఉద్యోగం చూడు. లేదా పెళ్ళి సంబంధం అయినా చూడు" అని అమ్మతో పంపించేసింది పెద్దమ్మ. ఆ అమ్మాయి మా ఇంట్లో మూడు నెలలపైగా ఉండిపోయింది. ఆ సమయంలో ఒక సంబంధం కుదిరింది. ఆర్.టీ.సీలో ఉద్యోగం కూడా వచ్చింది. వాళ్ళ అన్నయ్య ఈ రెండింటికీ ఒప్పుకోకుండా ఇంటికి తీసుకెళ్ళిపోయాడు. అలా పరాయి పిల్లలొచ్చినా ఎవర్నీ అమ్మమ్మా, అమ్మా కాదనలేదు.

"ఇల్లు సరిపోదు రవణ దొడ్డగారూ" అని సీతమ్మ అనే దూరపు చుట్టం తన కూతురు పురుడు మా ఇంట్లోనే పోసుకుంది. పదకొండోనాడు బారసాల చేసి, అమ్మ అరవైమందికి వండి భోజనం పెట్టింది. ఇంటిలో ఓ బుజ్జి పాప ఉందనే ఆనందం తప్ప, "మన ఇంట్లో ఈ గోల ఏవిటి చదువుకోకుండా, ఆ మంచం తాకకూ, పిల్లాడ్ని ఎత్తుకోకూ అనే ఆరళ్ళు ఏవిటి? " అని నేనూ మా అన్నయ్య చిరాకు పడేవాళ్ళంకాదు.

ఇలాంటి పురుళ్ళకి అంతంలేదు. మాచిన్నమ్మమ్మ కూతురికి కవలపిల్లలు ఆడపిల్లలు పుట్టారు. జాజి బొమ్మల్లా ఉండేవారు. సాయంత్రాలు స్నానాలు చేయించి వాకిట్లో మంచం వేసిపడుకోపెడితే "ఆముదాల పిల్లలా అమ్మా.. ఒక్కతీరున ముద్దుగున్నారు" అని సాయంకాలం సిగరెట్టు ఫ్యాక్టరీ షిఫ్టులు దిగే అవ్వలు ముద్దులు పెట్టుకుని వెళ్ళేవాళ్ళు. కొన్నిసార్లు ఆ వచ్చిన చుట్టాలకి ఉద్యోగాలు దొరక్క సంవత్సరాల తరబడి ఉన్న రోజులున్నాయి. ఇంత మంది ఉంటున్నారు అని చెప్తున్నా కాబట్టి, ఇల్లు పెద్ద బంగళా అనుకోకండి. మా ఆర్.టీ.సీ క్వార్టర్, ముందొక వరండా, వెనక హాలూ, పడకగదీ, ఆ వెనుక వసారా, వంటగదీ ఉండేవి. ముందూ వెనుకా వసారాలు తీసేస్తే రెండుగదులు. అదే మా పుష్పక విమానం రాజమహల్.

ఇంటి గురించి చెప్తుంటే ఓ తమాషా సంగతి గుర్తొస్తోంది. మా అమ్మమ్మగారు ఎవరొచ్చినా అన్నం పెట్టి పంపించే అన్నపూర్ణ. తాతయ్య స్వాతంత్ర సమరయోధుడు కాబట్టి ఆయన కోసం మేల్కోటే, ప్రకాశం పంతులూ, వి.వి.గిరిగారూ, భోగరాజు పట్టాభిసీతారామయ్యా, బూర్గుల రామకృష్ణారావుగారూ లాంటి పెద్దలు కూడా వచ్చేవాళ్ళుట. అందరికీ ఆవిడ వండి వడ్డించేదట. వాళ్ళు ఆవిడతో స్వంత అన్నల్లా అరమరికలు లేకుండా ఉండే వారుట. ఓ మిత్రుడు మినిస్టర్ అయ్యాకా ఓసారి తాతయ్య చూడ్డానికి మినిస్టర్ బంగళాకి వెళ్ళారుట. ఆ కబురూ ఈ కబురూ చెప్పాకా ఆయన "శ్రీహరిరావూ నువ్వు ఉండడానికి వచ్చినట్లున్నావు. కానీ మా గెస్ట్‌రూమ్ ఖాళీగా లేదు. ఎక్కడుంటావూ?" అని అడిగాడుట.

దానికి తాతయ ఫొల్లున నవ్వి, "ముక్కామలలో ఉన్నప్పుడు మూడు గదులే మన ముప్పైమందికి సరిపోయేది ఇప్పుడు ముప్పై గదులు సరిపోవడం లేదంటే, ఈ మంత్రి పదవి ఎంత దరిద్రం తెచ్చిపెట్టిందిరా?" అన్నారట. ***సిరి ఒక్కోసారి ఇలాంటి భావదారిద్రాలు తెస్తుంది.***

ఈ రెండు గదుల పుష్పక విమానంలో ఎన్ని పెళ్ళిళ్ళు జరిగాయో, శీమంతాలూ, బారసాలలూ, వడుగులూ అలాగే అశుభాలప్పుడూ ఈ ఇల్లు ఆదుకుంది. నాగ్‌పూర్ పెద్దనాన్న అర్థాంతరంగా పోయినప్పుడు, వచ్చిన బంధువులంతా పన్నెండో రోజు దాకా ఉండిపోతే, ఇల్లు విశాలమైంది. వంటపాత్రలు ప్రతిపూటా నిండుగా మారాయి కానీ ఏదీ నిండుకోలేదు.

కలిగిందాంట్లో అమ్మమ్మ పచ్చడి అన్నమే పెట్టిందో, కలి అంబలే పోసిందో కానీ ఎవర్నీ ఎప్పుడు కాదనలేదు. విసుగూ, విరామం లేకుండా వడ్డించేది. అందరి కడుపుల్లో ఆకలి ఆవిడకి తెలుసు. ఆఖరికి ఉత్తరాలు తెచ్చే పోస్ట్‌మేన్ 'గౌస్'ని కూడా "ఒక్క అట్టుముక్క తిని వెళ్ళు గౌసూ" అని ఆపేది. ఎండాకాలం చల్లని మజ్జిగ పెద్ద గ్లాసులో ఇచ్చి దాహం తీర్చేది. అమ్మ ఆఫీసులో పనిచేసే కుర్రాళ్ళు కూడా "సత్యవతక్కా కొంచెం పచ్చడి పెడ్తావా?" అంటూ బాక్సులు తీసుకుని ఇంటికొస్తే "ఇదిగో వేడి వేడిగా ఈ పప్పు పులుసు పోసుకో ఇంకొంచెం అన్నం వడ్డిస్తా. ఈ కూర ముక్క కలుపుకో" అని అమ్మ అన్నం పెట్టేది.

అవి ఆ రోజుల్లో అనుబంధాలు. వచ్చిన వాళ్ళు మాతోబాటే సబ్బుముక్కా, జంబుకానా, కొబ్బరి నూనె, చారన్నం పంచుకుని తినేవారు. కష్టంలో సుఖంలో పాలుపంచుకునేవారు.

ఈ రోజుల్లో ఈ న్యూక్లియర్ ఫ్యామిలీస్‌లో బంధువులు రావడం తరచూ జరిగే విషయం కాదు. వచ్చినవాళ్ళు చాలా దగ్గరవాళ్ళు అయితే తప్ప ఉండడం ఉంచుకోవడం జరిగేపనికాదు. మా చిన్నప్పటిలాగా వేలు విడిచిన బంధువో, కాలువిడిచిన చుట్టమో అంటే మన

పిల్లలు "ఆర్ యూ మేడ్?" అని అడుగుతారు. స్వంత కజిన్స్ కూడా ఫంక్షన్స్ అప్పుడు తప్ప కలవరు. ఇంక పరాయి ఊళ్ళకి పెళ్ళిళ్ళకి వెళితే హోటల్స్‌లోనో, ఫంక్షన్ హాల్స్‌లోనో ఉండడం వచ్చేయడం జరుగుతుంది. **ఇంక అమెరికాలో అయితే..**

"పిన్నీ కుంకుడు కాయలూ, సున్నిపిండీ, పసుపూ ఇవ్వు తలంటుకుని వస్తా" అనే రోజులు పోయాయి. బాత్‌రూమ్స్‌లో నాలుగు సీసాలుంటాయి. ఏది షాంపూనో, ఏది హెయిర్ రిమూవరో అర్థంకాదు. అడుగుదామంటే ఇంటి యజమానీ, యజమానురాలూ ఇంట్లో ఉండరు. ఆఫీసులకెళ్తారు. ఏది తిప్పితే వేడి వేడి నీళ్ళొస్తాయో. ఎటుతిప్పితే ఒంటి మీద బొొబ్బలొస్తాయో తెలీని పరిస్థితి. ఇంక బాత్‌రూమ్‌ల డోర్స్ విషయానికొస్తే ఒక్కొక్కరింట్లో ఒక్కో పద్ధతి. లోపలికెళ్ళి తలుపేసుకుని తియ్యడం రాక బందీలు అయిపోయే ప్రమాదం ఉంది.

అమెరికాలో సాహిత్య సమావేశాలు 'నాటా' అనీ 'ఆటా' అనీ 'నాట్స్' అనీ 'తానా' అనీ రకరకాల సమావేశాలకు కళాకారులు, సాహితీ వేత్తలూ వస్తారు.

వీరిని ఆహ్వానించినప్పుడే ఆర్గనైజర్స్ ఆ 'మూడు' రోజులూ మాత్రమే బస ఇవ్వడం జరుగుతుందని చాలా క్లియర్‌గా చెపుతారు. అందుకని ఈ ఆహ్వానితులు తమ అత్తకొడుకులనో, అమ్మాయి మొగుళ్ళనో సంప్రదించి అమెరికాలో ఉన్న ఆ ఊళ్ళకి టికెట్ వేయించుకుని ముందుగా రావడమో, లేదా ఆ 'మూడు రోజులూ' తరువాత వారం కుదుర్చుకోడమో చెయ్యక తప్పదు. స్వంత బంధువులు ఉన్నవాళ్ళకి ఫరవాలేదు కానీ ఎవరూ లేకుండా వచ్చి ముక్కూ మొహం తెలీని వాళ్ళ ఇళ్ళల్లో దిగేవాళ్ళకి కొన్ని కష్టాలుంటాయి. మొదటిసారి అమెరికా రావడం వల్ల పెట్టె మోసుకొచ్చిన బెల్‌బోయ్‌కి టిప్పు ఇవ్వాలని తెలీకపోవడం, ఎయిర్‌పోర్ట్‌లో కానీ ఫ్లయిట్‌లో కానీ ఎదురుపడిన గులాబీ బుగ్గల పసిపాపల్ని ముట్టుకోడం, ముద్దెట్టుకోవడం తప్పని తెలికపోవడం, క్యూ పద్ధతి కాఫీ, చిక్లెట్ కొనే దగ్గర కూడా పాటించాలని తెలీకపోవడం, ఎస్కిలేటర్లూ, లిఫ్టూ కంగారు పెట్టడం లాంటివి.

కానీ ఈ అతిథి దేవుళ్ళ వల్ల ఇక్కడున్న గృహదేవతల ఇబ్బందులు కూడా కోకొల్లలు. ఇక్కడ ఉండే వాళ్ళు సాధారణంగా భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేస్తూ ఉంటారు. ఇంట్లోనే ఉన్నారు కదా అని "అమ్మాయ్ కాస్త టీ పెట్టూ" అనకూడదు. ఆ అమ్మాయి 'వర్క్ ఫ్రం హోం' అని కాల్‌లో ఉండి ఉండచ్చు. చూసుకుని పిలవాలి. ఆ అమ్మాయి పాపం ప్రొద్దుటే లేచి పిల్లల్ని సవరించి, అసురుసుర్లై ఏదో ఇంత ఉడకేసి ఆఫీస్ కెళ్ళాల్సి రావచ్చు. అక్కడ మన వాపిరితనం అంతా చూపించి "ఇడ్లీల్లోకి కొబ్బరి చట్నీ చేసావా.. బావుంది. ఆ చేత్తోనే కాస్త కారం పొడి కొట్టాల్సింది. ఏదీ ఇంకో వాయి వెయ్యమ్మా. వెన్నపూసల్లా ఉన్నాయి ఇడ్లీలు" అని చేసిన వాయి మొత్తం లాగించేస్తే.. ఆ అమ్మాయి ఎప్పటికి ఆఫీసుకెళ్ళేనూ? అంతే కాదు. ఇలా అయితేనే తింటాం అలా అయితేనే తింటాం అనేవాళ్ళు కొందరూ.

"మా అమ్మమ్మ చేసిన అరిటికాయ కూర గుర్తొస్తోందమ్మా సాయంత్రానికి దప్పళం పెట్టు. అందులోకి చిలకడ దుంపా, గుమ్మడికాయా వెయ్యడం మరిచిపోకమ్మాయ్" అనేవాళ్ళు కొందరూ. ఎక్కడికైనా వచ్చినప్పుడే తమ భార్యమీద ఉన్న అనురాగం అంతా గుమ్మరిస్తూ "మా ఆవిడకి నేనంటే ఎంత ప్రేమో నా చేతి ముద్దలంటే పడి చస్తుంది" అనగానే ఆవిడ అందరిముందూ నోరు పట్టి చిన్నపిల్లలా తినడం, కొండకచో "మా ఆయన కలిపిన ఆవకాయన్నం తప్ప తినను" అని సిగ్గుపడుతూ చెప్పడం.

ఒకరికొకరు పరాయి ఇంట్లో మర్యాదలు చేసుకోవడం "ఏవండీ... వేడి చేస్తుంది, నిమ్మ చెక్క పిండిన మజ్జిగ తాగండి" అని ఆవిడ అంటే "రాత్రిపూట మళ్ళీ నిద్ర సరిగ్గా పట్టలేదంటావ్ అమ్మాయిని అడిగి ఏ బోర్నవిటానో తాగి పడుకో" అని ఆయన గారాబం. అప్పటిదాకా వంటిల్లు సర్ది, గిన్నెలన్నీ తోమి వెళ్ళి పడుకుందామన్న ఇల్లాలికి గుండెల్లో రాయి పడేస్తుంది. ఆ బోర్నవిటా కలిపి, మజ్జిగ చిలికి ఇచ్చి, పడుకునేసరికి, డోర్ మీద కొట్టి "అమ్మాయ్ కొద్దిగా జీలకర్రా, వాము చూపించి పడుకుంటావా? కడుపు భారంగా ఉందీ" అంటారు.

"మరి ఇరవై ఇడ్లీలు ఎవరు తినమన్నారూ?" అని ఆ అమ్మాయి మనసులో అనుకుని ఈ అతిథి దేవుళ్ళని తెచ్చి దింపిన మొగుడ్ని కొరకొరా చూసి కిందకి దిగి వస్తుంది.

ఆరగా ఆరగా "వేడీ నీళ్ళు పెట్టియమ్మా" అని అడిగేవాళ్ళు కొందరూ.

"మీ ఊళ్ళో చుట్టుపక్కల ఉన్నవన్నీ చూపించండి" అని డిమాండ్ చేస్తూ, జేబులోంచి కానీ బయటికి తియ్యని వాళ్ళు కొందరూ.

ఒకాయన వచ్చాడు. వచ్చినప్పటినుండీ తనొచ్చి ఈ అమెరికాకి ఏదో మహోపకారం చేసినట్లు చిటపటలాడిపోతున్నాడు. "అరె. సమయానికి వచ్చి భోజనానికీ, ఫలహారానికీ తీసుకెళ్ళలేనివాళ్ళు ఎందుకు పిలిచినట్లూ?" అని చిందులేస్తాడు. "ఎవరింట్లో పెళ్ళికొచ్చారయ్యా?" అని గృహస్తు అడిగితే ఈయన మొహం ఎలా ఉంటుందో మరి.

"పోయినసారి ఆయన్ని మా ఇంట్లో పెట్టుకుంటే 'పొద్దుట వండినది రాత్రి తినం' అని కరాఖండిగా చెప్పేస్తాడు ఈయన. మాకు ఏ పూటకి ఆ పూట వండే టైం ఉండదు. పైగా వంట చేస్తున్న మా ఆయన దగ్గరకెళ్ళి 'ఏవండీ మీకు ఉద్యోగం సద్యోగం లేదా? ఎవరు చేసే పని వాళ్ళు చెయ్యద్దూ' అని మా ఆయన్ని చెడగొడ్తున్నాడు" అని ఓ అమ్మాయి వాపోయింది.

ఇక్కడ సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలూ, ఇతర ఉన్నత ఉద్యోగాలూ చేస్తున్న వాళ్ళూ, మర్యాదకి పోయి ఓ విందులో వడ్డిస్తుంటే, ఈయన మండిపడ్తూ "నెయ్యి తెచ్చేది ఇప్పుడటయ్యా!? కామన్ సెన్స్ లేదా?" అంటే వాళ్ళు బిత్తరపోయారు.

ఇంక ఇక్కడికొచ్చిన వాళ్ళు పరాధీనలు. **ఎవరో వచ్చి "వీల్స్" మీద తీసుకెళ్తేకానీ మూవ్ అవడానికి 'వీల్' అవదు.** అయినా వాళ్ళ మీద ఆధారపడ్డామని మరిచిపోయి "ఏడండీ ఆయనా? ఎయిర్ పోర్ట్‌కి వెళ్ళాలి. ట్రాఫిక్ చూస్తే పెరిగిపోతోంది. సమయానికి రావాలనే బుద్ధి ఉండద్దా?" అని అరిచేవాళ్ళు ఇంకొకరు.

"అయ్యో టైం అయిపోతోందా పాపం! అయితే కాబ్ తీసుకుని వెళ్ళిపొండి" అని నా బోటిది అంటే "గప్‌చుప్" అయిపోతారు.

"అమ్మా వంకాయ కాశీలో వదిలేసాను. వంకాయకూర చేస్తే, ఆ చేత్తోనే బంగాళాదుంపలు నాలుగు వేయించు" అనే నియమాల నీలకంఠయ్య శాస్త్రులు కొంత మందీ.

"మాకు ఆవ పెట్టిన కూరలు ఇష్టం. క్యాబేజీ కూరలో ఆవపెట్టమ్మా" అని ఒక అతిథి అంటే, "ఆవ పెడితే నాకు వేడిచేసి ప్రాణం పోతుంది, చల్ల పులుసు పెట్టమ్మా" అనే ఆయన ఇంకోడూ.

ఆ ఇంట్లో చిన్న పాప చేతిలో ఉన్న లంచ్ బాక్స్ చూసి "ఇలాంటిదే నాకూ ఒకటి తెచ్చి పెట్టయ్యా" అనేవాడు ఒకడైతే "ఇది నాకు ఇచ్చేసి మీరు మళ్ళీ కొనుక్కోండి" అని జాతీయం చేసే అతిథి ఇంకొకరు.

"అమ్మో ఏ.సీ.లో చలికి తట్టుకోలేకపోతున్నాను" అని చెవుల్లో దూదులు పెట్టుకుని మునగదీసుకు పడుకునే ఆవిడ ఒకర్తి.

"ఏ.సీ సరిపోవడం లేదు. ఇంకాస్త పెంచలేరా?" అనే అతిథి దేవత ఇంకొకావిడా.

పెట్రోల్ పోసుకుని కార్లనిండా మైళ్ళు మైళ్ళు వీళ్ళని తిప్పుతుంటే, పిజ్జా తింటాననీ, కెమేరాకి బ్యాటరీ కొనమనీ కనిపించినదల్లా కావాలనీ డిమాండ్ చేసి వేధించే పీనాసి రాయళ్ళు మరికొందరూ,

అమెరికాలో ఇల్లాళ్ళకు ఎదురయ్యే ఇంకో ముఖ్యమైన ఇబ్బంది ఇండియా నుండి వచ్చే అతిథులకి బాత్‌రూంలు ఎలా వాడాలో తెలీక పాడు చేసి వెళితే, తరువాత బాగు చేసుకోవటం తలకుమించిన భారం అవుతుంది వాళ్ళకి. ఈమధ్య నాకు తెలిసిన వాళ్ళింటికి ఒక పండిత పరమేశ్వర శాస్త్రిగారు పాపం వాళ్ళావిడకి అమెరికా చూపిద్దామని అత్యుత్సాహంగా తీసుకొచ్చేశాడు.

పాపం ఆవిడకి స్నానం చేయగానే రోజూ కాళ్ళకి పసుపు రాసుకోవటం అలవాటు. కానీ ఇక్కడ అంతా కార్పెట్ ఉండడం వల్ల రాసుకోడానికి కుదరక వీళ్ళ ఇంటికి వచ్చినప్పుడు తయారయి కిందకి వచ్చి 'ఇవాళ నా మనసెంత ప్రశాంతంగా ఉందోనండి. మీ ఇల్లు అంతా చెక్క ఉంది కదా. హాయిగా పసుపు రాసేసుకున్నా' అనగానే ఈవిడ గుండె గాభరా పడిపోయింది. పాపం వెంటనే వెళ్ళి బాత్‌రూం

చెక్ చెయ్యలేదు కదా! వాళ్ళు అటువెళ్ళగానే బాత్‌రూంకి వెళ్ళి చూస్తే టబ్ అంతా పసుపు మరకలు, శాస్త్రి గారు పెట్టుకునే బొట్టు తాలుకూ కుంకుమ మరకలు... ఊహించుకోండి పాపం ఆవిడ పరిస్థితి.

”జలుబు ఒకరికైతే తుమ్ములొకరికన్నట్లు” ఈ అమెరికాలో ఏటా జరిగే సభలకి ఈ సెల్రబెటీలనబడే అతిథి దేవుళ్ళను తెచ్చి నెత్తిమీద పెడుతున్న భర్తల్ని ఏమీ అనలేక పళ్ళ బిగువున బాధ భరిస్తూ, భూమాతల్లా సహనంగా ఈ ఆహూతులని భరిస్తున్న సాధ్వీమణులకి ఎంతటి సత్కారాలు చేసినా తక్కువే!

నాకు ఓ సరదా ఉంది. ఈ చిటపటలాడే పెద్దలిళ్ళకీ, ఇక్కడ నయాగారాలూ, నానా గారాలూ పోయే జంటలిళ్ళకీ వెళ్ళి మిథునంలో అప్పదాసు కవలల్లా తినే ఈ మహోదరులూ తమ తమ ఇళ్ళల్లో ఏం తింటారో, ఎలా తింటారో చూడాలని. నా కల తీరేది కాదు కానీ వీళ్ళు మళ్ళీ వస్తే ఇంకా కొన్ని ఇళ్ళద్వారాలైనా తెరిచి ఉంటాయా అన్నది నా అనుమానం.

ఎంతో మర్యాదగా దూరదేశాన ఉన్న మమ్మల్ని ఇలా సభలకి పిలిచి, మేం వాగినదంతా విని, ఓ చెక్కముక్క ఇచ్చి, శాలువా కప్పి, ఉన్నన్నాళ్ళూ భోజనం పెట్టి, మెత్తని పడక ఇచ్చి, కార్లో తిప్పి, మా కాలికి మట్టి అంటకుండా, మా చేతికి తడి అంటకుండా చూసి, ఆప్యాయంగా ‘అక్కా‘ అనో ‘అన్నయ్యా‘ అనో పిలిచి ప్రేమని పంచిస్తున్న మన తెలుగు తమ్ముళ్ళనీ, చెల్లెళ్ళనీ కష్టపెట్టకుండా, వారికి స్వదేశం నుండి తమ సొంతవారే వచ్చిన ఫీలింగ్‌ని ఇచ్చి పుచ్చుకుంటే పోలా? ఎందుకింత రొష్టుపెట్టడం గెస్టులూ!? ఆలోచించండి!!

Post your comments

